నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
సోమవారం | ఫిబ్రవరి 19, 2024 | www.navatelangana.com

ఎస్ఐని సన్మానించిన ఆది జాంబవ సంఘం సభ్యులు

నవతెలంగాణ-మందమర్రి



ఆది జాంబవ సంఘం సభ్యులు నూతన ఎస్ఐ రాజశేఖర్‌ను ఘనంగా సన్మానించారు. మందమర్రి నూతన ఎస్ఐగా రాజశేఖర్ భాద్యతలను స్వీకరించిన సందర్బంగా ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఆది జాంబవ సంఘం మందమర్రి నూతనంగా ఏర్పడిన కమిటి సభ్యులను ఎస్ఐకి పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో ఆది జాంబవ సంఘం పట్టణ గౌరవ అధ్యక్షుడు కంబాల రాజనర్సు, అధ్యక్షుడు వాసాల శంకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ భీదుమారి శంకర్, కార్యదర్శి ఆవునూరి పోషం, ప్రచార కార్యదర్శి దాసరి రాజనర్సు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ఎంపీడీఓకు సన్మానం

నవతెలంగాణ-లక్షెట్టిపేట



బదిలీపై వెళ్లిన ఎంపీడీఓ కే.నాగేశ్వర్‌రెడ్డిని సర్పంచుల ఫోరం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా గతంలో లక్షెటిపేట ఎంపీడీఓగా పని చేసిన ఆయన ఇటీవల ఆదిలాబాద్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా లక్షెట్టిపేట మండల సర్పంచ్ల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలుగా లక్షెట్టిపేట మండల అభివృద్ధికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. అనంతరం శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షుడు గుల్లకోట సర్పంచ్ గొల్ల రవీందర్, కొత్తూరు సర్పంచ్ సొల్లు సురేష్, పింగిలి రమేష్, తిమ్మాపూర్ సర్పంచ్ చుంచు రవి పాల్గొన్నారు.

అగ్గి బుగ్గి అవుతోంది..!

- వేసవిలో తరచూ సంభవిస్తున్న ప్రమాదాలు
- ఉమ్మడి జిల్లాలో అరకొర కేంద్రాలతో తప్పని అవస్థలు
- సుదూర ప్రాంతాలకు సకాలంలో వెళ్లలేని వాహనాలు
- ఘటన స్థలికి వెళ్లే సరికి భారీ స్థాయిలో ప్రాణ, ఆస్తి నష్టం
- కొత్త స్టేషన్ల ప్రతిపాధనలకు లభించని మోక్షం
- నూతన సర్కారుపైనే ప్రజల ఆశలు

వేసవి వచ్చిందంటే చాలు..జనాలను అగ్ని ప్రమాదాలు వెంటాడుతున్నాయి. ఎక్కడ ఏ సమయంలో ప్రమాదం సంభవిస్తుందో తెలియక ఆందోళన చెందుతుంటారు. చిన్నపాటి నిర్లక్ష్యం వహించినా భారీ స్థాయిలో ఆస్తి నష్టానికి కారణమవుతోంది. విశాలమైన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అరకొర అగ్నిమాపక కేంద్రాలు ఉండటంతో పూర్తిస్థాయిలో ప్రమాదాలను నివారించడం సాధ్యం కావడం లేదు. జిల్లాల విభజన జరిగి ఆరేండ్లకు పైబడి కావస్తున్నా.. ఆయా జిల్లాల్లో కొత్త కేంద్రాలకు మోక్షం లభించడం లేదు. ఫలితంగా ప్రతి ఏటా వేసవిలో అగ్ని ప్రమాదాలు సంభవించడం.. భారీ స్థాయిలో ఆస్తి, ప్రాణ నష్టం జరగడం సాధారణ విషయంగా మారుతోంది. ప్రస్తుతం ఉన్న వాహనాలు ఒక్కోటి నాలుగు నుంచి ఐదు మండల పరిధిలోకి వెళ్లాల్సి ఉంటుంది.ఉమ్మడి జిల్లాలో కొత్త కేంద్రాలు ఏర్పాటుచేయాలని అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాధనలు పంపించినా ఫలితం లేకుండా పోయింది. ప్రస్తుతం కొత్త ప్రభుత్వం కొలువు దీరడంతో నూతన కేంద్రాల ఏర్పాటుపై ప్రజలు ఆశలు పెట్టుకున్నారు.



నవతెలంగాణ-ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

అగ్నిప్రమాదం ఎక్కడ..ఎప్పుడు సంభవిస్తుందో తెలియదు..చిన్న పాటి నిర్లక్ష్యం వహించినా పెద్ద ప్రమాదానికి దారితీసే అవకాశం ఉంటుంది. ఉమ్మడి జిల్లాలో ఏటా వేసవిలో అగ్ని ప్రమాదాలు చోటుచేసుకోవడం సాధారణంగా మారుతోంది. అగ్నిమాపక కేంద్రాలు ఉన్నా..సరిపడినంత లేవు. ప్రస్తుతం ఒక్కో కేంద్రం పరిధిలో ఐదు మండలాల వరకు ఉండటం.. వీటి పరిధిలోని మారుమూల ప్రాంతాలు సుదూరంలో ఉండటంతో వాహనాలు సకాలంలో అక్కడికి చేరుకోలేకపోతున్నాయి. అసలే ఆరకొర కేంద్రాలు ఉన్నాయంటే..వీటికి తోడు అటవీ ప్రాంతాల్లో రోడ్లు బాగా లేకపోవడం..మట్టి రోడ్లు అధికంగా ఉండటంతో సకాలంలో వెళ్లడం లేదు. ఫలితంగా ప్రమాదం సంభవించి పూర్తిస్థాయిలో ఆస్తి, ప్రాణ నష్టాన్ని పూర్తిస్థాయిలో నివారించడం సాధ్యం కావడం లేదు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 25 కిలోమీటర్లకు ఒక అగ్నిమాపక కేంద్రం ఉండాలనే నిబంధన ఉన్నప్పటికీ అనేక ఏండ్లుగా ఇది అమలు కావడం లేదు. ప్రభుత్వాలు, పాలకులు పట్టించుకోకపోవడం మూలంగా ఈ సమస్యకు పరిష్కారం లభించడం లేదు.

కొత్త వాటికి మోక్షమెప్పుడో..?

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రస్తుతం 12 అగ్నిమాపక కేంద్రాలు ఉన్నాయి. ఆదిలాబాద్, ఇచ్చోడ, ఉట్నూర్, నిర్మల్, భైంసా, ఖానాపూర్, జన్నారం, మంచిర్యాల, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్, బెల్లంపల్లి, చెన్నూర్‌లో ఇప్పటికే అగ్నిమాపక కేంద్రాలు ఉండగా కొత్తగా బోథ్, బేల, కెరమెరి మండలాల్లో ఏర్పాటుచేయాలని అధికారులు గత మూడేండ్ల క్రితం ప్రభుత్వానికి ప్రతిపాధనలు పంపించారు. కిందటేడాది బోథ్‌లో అకస్మాత్తుగా ప్రమాదం సంభవించి ఓ ఇల్లు పూర్తిగా కాలిపోయింది. స్థానికులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించగా.. ఆ వాహనం వెళ్లే సరికి అక్కడ జరగాల్సిన నష్టం జరిగిపోయింది. దీంతో ఆగ్రహం చెందిన ప్రజలు వాహనాన్ని అడ్డుకొని నిరసన తెలిపారు. కేంద్రం ఏర్పాటుచేయాలని అక్కడి ప్రజలు అనేక ఏండ్లుగా కోరుతున్నా ప్రభుత్వం దృష్టిసారించడం లేదు. గతేడాది ఇక్కడ 20గుంటల భూమిని సేకరించిన అధికారులు ప్రతిపాధలు పంపించినా ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాలేదు. కెరమెరి, బేల మండలాల్లోనూ ఇలాంటి పరిస్థితి కనిపిస్తోంది.అప్పటి ప్రభుత్వం ఏర్పాటుచేస్తామని చెప్పినప్పటికీ..కేవలం హామీలకే పరిమితమైందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తాజాగా రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువు దీరడంతో ప్రజలు భారీగా ఆశలు పెట్టుకున్నారు. కనీసం కాంగ్రెస్ ప్రభుత్వమైనా కొత్త వాటిని మంజూరుచేస్తుందని ఆకాంక్షిస్తున్నారు.

కొత్త వాటికి ప్రతిపాధనలు పంపించాం

కేశవులు, జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి

ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం 12 కేంద్రాలు ఉన్నాయి. మరో రెండు కేంద్రాల కోసం ప్రతిపాధనలు పంపించాం. కానీ నిధులు విడుదల కాలేదు. మరోపక్క వేసవిలో ప్రమాదాలు నివారించేందుకు అనుక్షణం అప్రమత్తంగా ఉన్నాం. వాహనాలు, నీటి సౌకర్యం తదితర వాటిని సిద్ధం చేశాం. ప్రమాదాలు నివారించేందుకు శక్తివంచన లేకుండా కృషిచేస్తాం.

మేడారంకు ప్రత్యేక బస్సులు ప్రారంభించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-నస్పూర్

మేడారం జాతరకు వెళ్లే భక్తులకు కేటాయించిన ప్రత్యేక బస్సులను ఆదివారం ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసియా ఖండంలోనే అతిపెద్ద జాతర మేడారం అని, జాతరకు వెళ్లే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బస్సులను ఏర్పాటు చేయాలని అన్నారు. శ్రీరాంపూర్ నుంచి వెళ్లే భక్తులకు పెద్దలకు రూ.400, పిల్లలకు రూ.210 చార్జీలు ఉంటాయన్నారు. అనంతరం నస్పూర్ పట్టణంలోని సీసీసీ ముక్కిడి పోచమ్మ గుడి వద్ద సమ్మక్క, సారక్క జాతర ఏర్పాట్ల పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సురిమిళ్ళ వేణు, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

గోసంరక్షణ బాధ్యతగా భావించాలి



నవతెలంగాణ-భైంసా

గోసంరక్షణకు ప్రతి హిందువు పాటుపడాలని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. ఆదివారం బైంసాలో గోశాలలో సంరక్షణ సంస్థ విరాళాలతో నిర్మించిన షెడ్డు, గోశాల ఆఫీస్‌ను ప్రారంభించిన సందర్బంగా ఆయన మాట్లాడారు. గత కొన్ని సంవత్సరాలుగా గోశాల కోసం పాటుపడిన వారందరికీ ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలియజేశారు. తల్లి లాంటి గోవులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, గోమాత అనంతమైన ప్రేమను చూపిస్తుందన్నారు. గో సంరక్షణ కోసం 390 ఎకరాల భూమిని దానం చేసిన సామ్ చెనయ్ ముధోల్ నియోజకవర్గ ప్రజలు ఎప్పటికీ మర్చిపోరన్నారు. గోశాల భూముల పరిరక్షణ కోసం కంచ ఏర్పాటు చేయడానికి నిధులు ఇస్తానని, అవసరమైతే దాతల సహాయంతో గోశాల భూములను పకడ్బందీగా సంరక్షించుకుందాం అన్నారు. రామ మందిర నిర్మాణం వలన హిందువుల తడాఖా ఏంటో ప్రపంచానికి తెలిసిందన్నారు. కార్యక్రమంలో బైంసా సీఐ రాజారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ బి గంగాధర్, పారిశ్రామికవేత్త నాగ్‌నాథ్ పటేల్, ఆర్ఎస్ఎస్ బాధ్యులు సాదూల కృష్ణదాస్, గో సంరక్షణ సమితి బాధ్యులు నిమ్మల ప్రవీణ్, సిందే లక్ష్మణ్ పటేల్, నంగి దత్తు, తూమోల్ల దత్తాత్రి, సుదర్శన్ పటేల్, రామకృష్ణ పాల్గొన్నారు

జన్నారంలో సంత్ సేవాలాల్ జయంతి

నవతెలంగాణ-జన్నారం



శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ బోధనలు అందరికీ ఆచరణీయమని బంజారా సేవా సంఘం మండల నాయకులు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ధర్మారం చౌరస్తాలో ఉన్న సేవాలాల్ చౌక్ వద్ద సేవాలాల్ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సేవాలాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు చేశారు. బంజారా కులస్తులను ఏకతాటిపై తీసుకువచ్చిన మహనీయుడు సేవాలాల్ అని కొనియాడారు.

వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే

ఫోన్కాల్ గ్రామపంచాయతీ పరిధిలోని జువ్విగూడాలో సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాల్లో ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే రేఖ నాయక్ పాల్గొన్నారు. బంజారా జాతి మహిళలతో కలిసి సాంస్కృతిక నృత్యాలు చేశారు. సేవాలాల్ అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలన్నారు. అనంతరం సేవాలాల్ మహారాజ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. సేవాలాల్ మహారాజ్ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అన్ని దానాల కంటే అన్నదానం గొప్పది

నవతెలంగాణ-తాండూర్

అన్ని దానాల కెల్లా అన్నదానం గొప్పదని బెల్లంపల్లి వన్ టౌన్ ఎస్‌హెచ్ఓ దేవయ్య అన్నారు. ఆదివారం అమ్మ ఒడి ఎన్‌జీఓ అన్నదాత ప్రాజెక్టు టెక్నో డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రతి ఆదివారం అమ్మఒడి ఎన్‌జీఓ చేస్తున్న అన్నదానం కార్యక్రమానికి తమ వంతు పూర్తిస్థాయి సహకారాన్ని అందిస్తామని తెలిపారు. బెల్లంపల్లిలో 237వ వారాలు అన్నదాన కార్యక్రమంలో పాల్గొనడం ఆనందాన్నిచ్చిందన్నారు. అమ్మ ఒడి ఎన్‌జీఓ ఇలాంటి మంచి సేవలు చేస్తు మునుముందు కొనసాగలని అభినందించారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఒడి సభ్యులు హనుమాండ్ల సువర్ణ, గన్నెవరం తిరుమల చారి, రంగ సురేష్, సిద్దమల్ల రఘు, జంజర్ల దినేష్ కుమార్, చెందుపట్ల లింగమూర్తి, ఎండీ యూసుఫ్ పాల్గొన్నారు.

ఛలో సెక్రటేరియట్ విజయవంతం చేయండి

నవతెలంగాణ-దిలావర్‌పూర్

ఈ నెల 20 మంగళవారం ధూప దీప నైవేద్యం అర్చకుల ఆధ్వర్యంలో తలపెట్టిన చలో సెక్రటేరియట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు యోగేష్ కుమార్ శర్మ ఆదివారం ప్రకటన పేర్కొన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు దౌలతాబాద్ వాసుదేవ శర్మ ఆదేశాల మేరకు ధూప దీప నైవేద్య అర్చకుల సమస్యల పరిష్కారానికి నూతన అర్చకులకు పెండింగ్‌లో ఉన్న ఏడు నెలల వేతనాలు విడుదల, ఉద్యోగ భద్రత తదితర సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి విన్నవించడం జరుగుతుందని అన్నారు. జిల్లాలోని ధూప దీప నైవేద్య అర్చకులు ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీయడానికే టాలెంట్ టెస్ట్



నవతెలంగాణ-నస్పూర్

విద్యార్థులలో సజనాత్మకతను వెలికితీయడానికే టాలెంట్ టెస్ట్‌లు నిర్వహించడం జరుగుతుందని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి అన్నారు. ఆదివారం మంచిర్యాలలోని శ్రీ చైతన్య ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 25 సంవత్సరాలుగా టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్న ఏకైక సంఘం ఎస్ఎఫ్ఐ అని అన్నారు. రానున్న వార్షిక పరీక్షలలో విద్యార్థుల భయాన్ని తగ్గించేందుకు కూడా ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీ చైతన్య స్కూల్ ప్రిన్సిపల్ జోబిన్ హాజరై మాట్లాడుతూ నేటి అధునాతన కాలంలో విద్యార్థులు వారి మేధో శక్తిని పోటీ ప్రపంచానికి అనుగుణంగా పెంపొందించుకోవాలని, విజ్ఞాన వంతులుగా, మేధావులుగా తయ్యారవ్వాలని తెలిపారు. విద్యార్థులు పాఠ్యపుస్తకలతో పాటు, అనేక అభ్యుదయ పుస్తకాలు చదవాలని సమాజాన్ని అధ్యయనం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీ చైతన్య పాఠశాల ఇన్‌చార్జి గోవర్ధన్, పీఈటీ కుమారస్వామి, ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు ఈదునూరి అభినవ్, అరవింద్ పాల్గొన్నారు.



ఘనంగా ప్రభుత్వ కళాశాల వార్షికోత్సవం



నవతెలంగాణ-దండేపల్లి

దండేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవాన్ని విద్యార్థులు, సిబ్బంది ఆనందోత్సవాల మధ్య జరుపుకున్నారు. కళాశాల వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ప్రథమ సంవత్సరం విద్యార్థులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ శోభ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు విద్య భారం కాకూడదని ఉద్దేశంతో దండేపల్లిలో ప్రభుత్వ కళాశాల ఏర్పాటు చేశారని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారని ఈ కళాశాలలో చదివిన విద్యార్థులు ఉన్నత స్థాయిలో స్థిరపడ్డారని ఆమె గుర్తు చేశారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులు ఉన్నారని ఆమె అన్నారు. కళాశాలకు సొంత భవనం కేటాయిస్తే బాగుంటుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రదర్శనలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉన్నతమైన ఆశయాలతో లక్ష్యాన్ని సాధించాలి

నవతెలంగాణ-తాండూర్

జీవితంలో సక్సెస్ సాధించిన ప్రతి ఒక్కరూ బాల్యం నుంచే ఉన్నతమైన ఆశయాలతో లక్ష్యాలను అధిగమించారని ప్రముఖ మోటివేటర్, ఇంపాక్ట్ సర్టిఫైడ్ ట్రైనర్ అర్జున్ మద్దెవేణి అన్నారు. బెల్లంపల్లి సిఓఈలో టెన్త్ ఇంటర్మీడియట్ విద్యార్థులకు పరీక్షల సంసిద్ధత కోసం ఏర్పాటుచేసిన ప్రత్యేక కార్యక్రమంలో మాట్లాడారు. ప్రతి సబ్జెక్ట్‌పై సరైన అవగాహనతో పరీక్షలకు సన్నద్ధంకావాలని సూచించారు. కష్టతరమైన సబ్జెక్టుల కోసం ఎక్కువ సమయాన్ని కేటాయించడం ద్వారా మంచి మార్పులు సాధించవచ్చునని తెలిపారు. ఒత్తిడి ఆందోళన లేకుండా పరీక్షలకు సన్నద్ధం కావాలని తెలిపారు. సబ్జెక్ట్‌లోని అంశాలపట్ల ఇష్టాన్ని ఏర్పరుచుకోవడం ద్వారా పాఠ్యాంశాలు సులువుగా అర్థమవుతాయని తెలిపారు. పరీక్షల సమయంలో పౌష్టికహారం తీసుకుంటూ శరీరానికి పూర్తిస్థాయిలో విశ్రాంతిని ఇవ్వాలని తెలిపారు. వీలైనంత వరకు సెల్ ఫోన్‌కు దూరంగా ఉండటం వల్ల పరీక్షల్లో మంచి ఫలితాలు పొందవచ్చునన్నారు. పిల్లలకు వీడియోలు చూపిస్తూ ప్రపంచంలో విజయాలు సాధించిన వ్యక్తుల కాలపట్టికను పరిచయం చేస్తూ సాగిన ప్రసంగం ఆద్యంతం ఆకట్టుకుంది. అనంతరం ప్రిన్సిపాల్ ఐనాల సైదులు ఉపాధ్యాయులతో కలిసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రాజ్ కుమార్, జేవీపీ పొన్నం శ్రీనివాస్, సీనియర్ ఉపాధ్యాయులు ప్రమోద్ కుమార్, శోభ, చందా లక్ష్మీనారాయణ, ఎండీ రఫీ, కొక్కుల రాజేశ్వర్, పొన్నాల రాజ్ కుమార్, దత్తప్రసాద్, వామన్, మిట్ట రమేష్, చంద్రశేఖర్, విజయ, ఆకెనేపల్లి రాకేష్, కట్ల రవీంధర్, ఎస్ఎస్ఆర్ వర్మ, పిన్నింటి కిరణ్ పాల్గొన్నారు.

సేవాలాల్ మహారాజ్ ఆశయ సాధనకు కృషి చేయాలి

నవతెలంగాణ-బైంసా

సంత్ సేవాలాల్ మహారాజ్ ఆశ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ అన్నారు. బైంసాలో సంత్ సేవాలాల్ చౌక్ వద్ద జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. సేవాలాల్ చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. బంజారాల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ముధోల్ నియోజకవర్గం లో బంజారాలకు తన సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయన్నారు. కార్యక్రమంలో బంజారా సంఘం నాయకులతో పాటు బీజేపీ నాయకులు అభినవ సర్దార్, మాజీ మున్సిపల్ చైర్మన్ బి.గంగాధర్, ఎంపీపీ అబ్దుల్ రజాక్, నాయకులు సోలంకి భీమ్‌రావు, తాలోడ్ శ్రీనివాస్, ఎను పోతుల మల్లేష్, గాలి రవి, బాలాజీ సూత్రవే పాల్గొన్నారు.



నేతాజీనగర్‌లో ఘనంగా బోనాల పండగ



నవతెలంగాణ-భైంసా

పట్టణంలోని నేతాజీనగర్‌లో ఆదివారం బోనాల పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ బోనాల పండుగలో పాల్గొని మైసమ్మ ఆలయంలో పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు పలు సమస్యలను విన్నవించారు. నేతాజీనగర్‌లో ఫంక్షన్ హాల్ కోసం నిధులు వెచ్చించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ మాట్లాడుతూ ఫంక్షన్ హాల్ కోసం నిధులు వెచ్చించేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. గట్టు మైసమ్మ, పాంద్రి మైసమ్మ, అమ్మవార్ల ఆశీర్వాదంతో తాను గెలుపొందానని, ప్రజల తనకిచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రజాసేవకు పాటుపడతానన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ బి.గంగాధర్, ఆలయ చైర్మన్ కాండ్లి సాయినాథ్, స్థానిక కౌన్సిలర్ గాలి రవి, నాయకులు కోర్వ చిన్నన్న, సాయినాథ్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు ఎనపోతుల మల్లేష్, జిల్లా ఉపాధ్యక్షుడు తాలోడ్ శ్రీనివాస్ మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ లింగురాం, మాణిక్ పాల్గొన్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ పనుల పరిశీలన



నవతెలంగాణ-మందమర్రి

స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్ నిర్మాణ పనులను డైరెక్టర్ ఆపరేషన్ అండ్ పా ఎన్‌వీకే శ్రీనివాస్ పరిశీలించారు. జీఎం మనోహర్‌తో కలిసి ఆదివారం ఏరియాలో పర్యటించారు. సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్, సిఎస్ఆర్ ఆధ్వర్యంలో ప్రారంభించబోతున్న స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్ పనులను పరిశీలించారు. కేకే ఓసి ప్రాజెక్టు మ్యాపులను పరిశీలించి ఉత్పత్తి ఉత్పాదకత పెంపొందించడానికి అవసరమైన సూచనలను అధికారులకు తెలిపారు. అనంతరం కేకే ఓసి పునరావాస కేంద్రం పెద్దనపల్లి గ్రామంలో పర్యటించి జరుగుతున్న పనుల పురోగతి వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం రాజేశ్వర్‌రెడ్డి, ఎజీఎం ఈఅండ్ఎం నాగరాజు, సిమ్టార్స్ ఎస్ఓఎం విజయ్ కుమార్, కేకే ఓ.సి ప్రాజెక్ట్ ఆఫీసర్ రమేష్, సివిల్ డీజీఎం నాగరాజు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-నస్పూర్



ఇటీవల ఆటో డ్రైవర్ సదానందం మృతి చెందడంతో కుటుంబానికి రూ.10 వేలు బాలాజీ టెంట్ హౌస్ యజమాని కుమారస్వామి శ్రీరాంపూర్ ఎస్సై సంతోష్ చేతుల మీదుగా ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానికుడు సదానందం గుండెపోటుతో మరణించడం చాలా బాధాకరమని, తన వంతు సహాయంగా రూ.10వేలు అందించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
సోమవారం | ఫిబ్రవరి 19, 2024 | www.navatelangana.com

తదస్తు ధ్యాన పిరమిడ్ ప్రారంభం

నవతెలంగాణ-లక్షెట్టిపేట



లక్షెటిపేట పట్టణంలోని గోదావరి రోడ్‌లో తదస్తు పిరమిడ్ ధ్యాన కేంద్రాన్ని ప్రారంభించారు. ఆదివారం పట్టణంలోని కట్ట సరోజ- సత్యనారాయణ ఇంటి పైన తదస్తు పిరమిడ్ ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా లక్షెట్టిపేట మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పిరమిడ్ సీనియర్ మాస్టర్ అగ్గి భూమయ్య, మంచిర్యాల అధ్యక్షులు భాస్కర రాజు, ప్రధాన కార్యదర్శి మల్లేష్, పిరమిడ్ మాస్టర్లు పాల్గొన్నారు.

కళ్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-జైనథ్



మండలంలోని కూర గ్రామంలో ఆదివారం వెంకటేశ్వర్ల స్వామి కళ్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. చుట్టూ పక్కల గ్రామాల నుంచే కాకుండా మహారాష్ట్ర నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి కళ్యాణోత్సవాన్ని తిలకించారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్ కళ్యాణ క్రతువులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతనలో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి, ఎంపీపీ గోవర్ధన్, జెడ్పీటీసీ తుమ్మల అరుంధతి వెంకటరెడ్డి, మాజీ సర్పంచ్ అడ్డి లతా వెంకటరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

మంటల్లో దగ్ధమైన శనగ పంట



నవతెలంగాణ-జైనథ్

మండల కేంద్రంలో ఆదివారం ఓ రైతు శనగ పంటని గుర్తుతెలియని దుండగులు నిప్పంటించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు పరీక్షించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన సయ్యద్ సాజిద్ ఖాన్3 ఎకరాల పొలంలో శనగ పంట వేశాడు. పంట కోతకి రావడంతో కోసి కుప్ప పెట్టాడు. శనివారం రాత్రి సమయంలో గుర్తుతెలియని దుండగులు శనగ కుప్పకి నిప్పంటించారు. ఉదయం పొలానికి వచ్చిన సాజిద్ పంట మొత్తం కాలిపోవడాన్ని గమనించాడు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు అందించాడు. రైతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. రైతు సాజిద్ ఖాన్ మాట్లాడుతూ ఎకరానికి ఎనిమిది క్వింటాల చొప్పున 25 క్వింటాల శనగ దిగుబడి వస్తుందన్నారు. దాదాపు రూ.లక్ష 25 వేల వరకు నష్టం జరిగిందని తెలిపారు. నష్టపరిహారం అందించి ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

బౌద్ధ మహాసభ అధ్యక్షుడికి సన్మానం

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

పట్టణంలోని కైలాష్ నగర్ అశోక బుద్ధ విహార్‌లో భారతీయ బౌద్ధ మహాసభ నూతన జిల్లా అధ్యక్షుడు విట్టల్ బుక్లేను ఘనంగా సన్మానించారు. బౌద్ధమహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి దయానంద్ ఆధ్వర్యంలో ఆదివారం ఈ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా ఉత్తర తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రత్నజాడే ప్రజ్ఞకుమార్ హాజరయ్యారు. ముందుగా గౌతమ బుద్ధుని విగ్రహానికి, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, రమాబాయి అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాల వేశారు. అనంతరం బుద్ధవందనం ఆలపించారు. తర్వాత రమాబాయి అంబేద్కర్ మహిళా మండలి ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన జిల్లా అధ్యక్షునికి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ప్రజ్ఞకుమార్ మాట్లాడుతూ భారతీయ బౌద్ధమహా సభ నూతన అధ్యక్షుని ఆధ్వర్యంలో గ్రామ కమిటీలు, వార్డుల కమిటీలు, మండల కమిటీలు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలని అన్నారు. మే నెలలో రాబోయే బుద్ధ జయంతిని వేలాది మందితో జరుపుకునేలా ప్రణాళిక తయారు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బుద్ధ జయంతిని సెలవుదినంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. అలాగే బౌద్ధులకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని కోరారు. రాబోయే రోజుల్లో ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తామని అన్నారు. అనంతరం పలు తీర్మానాలు చేశారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

- బెల్లంపల్లి ఏసీపీ రవి కుమార్

నవతెలంగాణ-తాండూర్

ప్రభుత్వ అనుమతి లేని నకిలీ విత్తనాలను విక్రయిస్తే చట్టబద్ధమైన చర్యలు తీసుకుంటామని బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ తెలిపారు. ఆదివారం నెన్నెల, భీమిని పోలీస్ స్టేషన్లను సందర్శించారు. రికార్డులను పరిశీలించి సిబ్బంది నిర్వర్తిస్తున్న విధులను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ పరిధిలో నమోదైన కేసుల వివరాలపై ఆరా తీశారు. పెండింగ్ కేసులను త్వరగా పూర్తిచేయాలని సీఐ, ఎస్ఐలకు సూచించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ప్రస్తుతం నకిలీ విత్తనాల రవాణా సరఫరా జరిగే అవకాశం ఉన్నందున పోలీస్ శాఖ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నకిలీ విత్తనాల అరకట్టి రైతులు మోసపోకుండా చూడాలని సూచించారు. పోలీస్ స్టేషన్ల పరిధిలో గస్తీ పెంచాలన్నారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ప్రణాళికతో పకడ్బందీగా విధులు నిర్వహించాలని తెలిపారు. బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి ప్రజల మన్ననలు పొందాలని సూచించారు. వ్యాపారులు, సంస్థలు, వ్యక్తులు ఎవరైనా నకిలీ విత్తనాలు విక్రయిస్తే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయన్నారు. ఈ కార్యక్రమంలో తాండూర్ సీఐ శ్రీనివాస్ రావు, బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలొద్దీన్, భీమిని ఎస్ఐ ప్రశాంత్, నెన్నెల ఎస్ఐ శ్యామ్‌పటేల్ తదితరులు పాల్గొన్నారు.

లైసెన్స్ లేకుండా కొనుగోలు చేస్తే చర్యలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పత్తి కొనుగోళ్ల ప్రక్రియ జిల్లాలో ప్రారంభమైంది. మార్కెట్‌లో సీసీఐ ద్వారా రైతుల వద్ద నుంచి రూ.6 వేల 900 వరకు కొనుగోళ్లు చేస్తున్నారు. అయితే మహారాష్ట్రలో పత్తి సాగు అంతగా లేకపోవడంతో అక్కడి వ్యాపారులు ఇక్కడికి వచ్చి పత్తి కొనుగోళచేస్తున్నట్లు మార్కెటింగ్ అధికారులు గుర్తించారు. ఈ క్రమంలోనే మార్కెటింగ్ అధికారులు లైసెన్స్ లేకుండా వ్యాపారాలు చేస్తున్న వారిపై చట్టరీత్య తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేశారు. జైనథ్‌లో జరిగిన కొనుగోళ్లు ఇతర మండలాల్లో జరగకుండా ముందస్తుగా అన్ని చర్యలు తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా మార్కెటింగ్ ఏడీ శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలోని మార్కెట్ యార్డు పరిధిలో లైసెన్స్ లు లేకుండా పత్తితో పాటు ఇతర పంటలను ప్రయివేట్ వ్యక్తులు కొనుగోళచేస్తే చర్యలుంటాయన్నారు. మార్కెట్ నిబంధనల ప్రకారం కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. రైతులు కూడా దళారులకు అమ్మి మోసపోవద్దని సూచించారు. ఎవరికైన లైసెన్స్ కావాలంటే సంబంధిత మార్కెట్ యార్డులలో సంప్రదిస్తే పూర్తి వివరాలు తెలియజేస్తారన్నారు. సోమవారం నుంచి ఆయా మార్కెట్ యార్డులను పరిశీలించి రైతులకు అవగాన కల్పిస్తామన్నారు.

సేవాలాల్ జయంతిని విజయవంతం చేయాలి

నవతెలంగాణ-ఉట్నూర్

ఈనెల 20న ఆదిలాబాద్‌లోని రాంలీలా మైదానంలో జరిగే సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతిలో లంబాడీలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని నాయకులు కోరారు. జయంతి ఉత్సవ సమితి ఆదేశాల మేరకు ఆదివారం మండలంలోని ఉదానాయక్ తండా, ఎండా గ్రామంలో సేవాలాల్ జయంతి కరపత్రాలను చవాన్ సేవాదాస్ విడుదల చేశారు. జయంతికి అధిక సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. గ్రామాల సర్పంచులు, నాయక్, కారోబారి, డావులు పాల్గొన్నారు.



శాస్త్రీయతను కనుమరుగు చేస్తున్న బీజేపీ ప్రభుత్వం

- విజ్ఞాన దర్శిని ఫౌండర్ రమేష్

నవతెలంగాణ-నస్పూర్



కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం శాస్త్రీయతను కనుమరుగు చేస్తోందని నేటి పాలకులు మూఢత్వాన్ని ప్రోత్సహిస్తున్నారని విజ్ఞాన దర్శిని ఫౌండర్ రమేష్ అన్నారు. ఆదివారం శ్రీరాంపూర్ ఏరియాలోని సీఐటీయూ కార్యాలయంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మతోన్మాదం - సైన్స్- పాలకుల వైఖరి అనే అంశంపై రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సంకే రవి అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. నేటి సమాజంలో శాస్త్రీయత అనేది చాలా ముఖ్యమైనదని కానీ కేంద్రంలో అధికారంలో ఉన్న బీపీపీ ప్రభుత్వం శాస్త్రీయతను పూర్తిగా లేకుండా చేయాలని ఉద్దేశంతో 104 సం.రాలు చరిత్ర ఉన్న ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ సంస్థకు కొత్త ప్రయోగాలు చేయకుండా నిధులు ఇవ్వడం లేదన్నారు. ఆర్ఎస్ఎస్ సంస్థ అధ్వర్యంలో నడుస్తున్న సూడో సైన్స్‌కు గత పది సంవత్సరాలుగా భారీగా నిధులు ఇవ్వడం జరుగుతోందని, మనదేశంలో సైన్స్ ను అభివృద్ధి చేయడం లేదని దుయ్యబట్టారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం ప్రజల్లో మూఢత్వాన్ని పెంచుతు కార్పొరేట్ సంస్థలు, దాని అధిపతులు ప్రజల సంపదను ఎంత దోషుకుంటున్నరో తెలియకుండా చేస్తున్నారని పేర్కొన్నారు. విద్యార్థులు నేర్చుకునే పాఠ్యాంశ పుస్తకాల్లోని శాస్త్రీయత పాఠాలను కూడా తొలగించిందని,అంతేకాకుండా ప్రభుత్వం ఏర్పడి పది ఏండ్లు గడిచిన ప్రజల ఆకలి,నిరుద్యోగం, విద్య, వైద్యం, ఉపాధి, కనీస వేతనం ఇలాంటి సమస్యలు పరిష్కారం చేయడం లేదని తెలిపారు. మతాన్ని సాధనంగా చేసుకొని మళ్ళీ పార్లమెంట్ ఎన్నికల్లో అధికారం కోసం బీజేపీ ప్రభుత్వం ప్రజల్ని కులం, మతం, ప్రాంతం, భాష అంటూ విడదీసి పాలిస్తుందని విమర్శించారు. ఈ దేశంలో ప్రజలందరికి అందుబాటులో ఉండే విజ్ఞాన ప్రచార సంస్థను ప్రభుత్వం నడిపిందని, కానీ బీజేపీ ప్రభుత్వం దీనిని మూసివేసి, ఈ స్థానంలో ఆర్ఎస్ఎస్ అనుబంధంగా హర్యాన రాష్ట్రంలో పెట్టినటువంటి మూఢవిశ్వాసాల ప్రభుత్వ సంస్థను ఈ దేశ ప్రధాని ప్రారంభించారన్నారు. శాస్త్రీయతను పూర్తిగా లేకుండా చేసి ప్రజల్లో మూఢ విశ్వాసాలను పెంచడం, మతం పేరుతో విద్వేషాలు రెచ్చగొట్టడం, మళ్లీ అధికారంలోకి రావడం కోసమేనని మండిపడ్డారు. ఇది బీజేపీ అవలంబిస్తున్న విధానాలను ఇప్పటికైనా ప్రజలు, విద్యార్థులు, యువత ఆలోచించి ప్రజల్లో ఉన్న మూఢ విశ్వాసాలను పారదోలి, శాస్త్రీయతను సమాజంలో తీసుకెళ్లాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు శోభారాణి, మహమ్మద్ అలీ,మహేష్, తోకల రాజేశం, బోడంకి చందు, ఎర్ర పున్నం, కాదాసి రవీందర్, కనకరపు అశోక్, దుంపల రంజిత్ కుమార్,దుర్కే మోహన్, మిడివెల్లి రాజ్ కుమార్ ,సామల ఉమా రాణి,దుర్గం సిద్దార్థ, రాంమూర్తి పాల్గొన్నారు.

విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ ఉపయోగకరం

- ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి డోకే నవీన్



దహెగాంలో..

నవతెలంగాణ - దహెగాం

ఎస్ఎఫ్ఐ కొమురం భీం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఎస్ఎస్‌సీ టాలెంట్ టెస్టును ఆదివారం అన్ని మండలకేంద్రాల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దహెగాం ఎస్ఐ సనత్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ప్రశ్నాపత్రాన్ని విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ పరీక్ష విద్యార్థులలో సృజనాత్మకతను వెలికితీసేందుకు, భయాన్ని తగ్గించేందుకు ఉపయోగపడుతుందని తెలియజేశారు. మరో నెలలో పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలకు సిద్ధం చేసేందుకు ఉపయోగపడి వారిలో టాలెంట్ ఎంత ఉందో వారికే తెలియజేయడం కోసం ఈ పరీక్ష చాలా ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థులను ఉన్నత స్థానంలోకి తీసుకెళ్లడం కోసం ఎస్ఎఫ్ఐ చేస్తున్న కృషిని అభినందించారు. విద్యార్థులు కూడా పబ్లిక్ పరీక్షలంటే భయం లేకుండా కష్టపడి చదివి బాగా రాయాలని అన్నారు.అనంతరం పలువురు విద్యార్థులు కూడా ఈ పరీక్ష అభిప్రాయం వ్యక్తం చేశారు. జిల్లా సహాయ కార్యదర్శి డోకే నవీన్ మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఎస్ఎఫ్ఐ ముందుంటుందని తెలిఆపరు. కార్యక్రమంలో మండల సభ్యులు పున్నం, రిషీ, సందీప్, గణేష్ పాల్గొన్నారు.

బెజ్జూరు : ఎస్ఎఫ్ఐ కొమురం భీం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలోని జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ టాలెంట్ టెస్ట్‌లో సుమారు 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు పబ్లిక్ పరీక్షలంటే భయపడకుండా శ్రద్ధగా చదివి పరీక్ష రాయాలని సంఘం నాయకులు తెలిపారు. భవిష్యత్తుల్లో విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఎస్ఎఫ్ఐ పోరాడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కళ్యాణ్, ఉపాధ్యక్షుడు అర్జున్, జిల్లా నాయకులు ప్రశాంత్, మండల నాయకులు జావిద్, రాజు, కేజీహెచ్ పాల్గొన్నారు.



బెజ్జూర్‌లో..

డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన జీవన్ రెడ్డి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ నూతన డీఎస్పీగా ఎల్. జీవన్ రెడ్డి ఆదివారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఆదిలాబాద్ పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో ఆయన బాధ్యతలను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనకు సిబ్బంది సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణకు తన వంతు కృషి చేస్తానని డీఎస్పీ జీవన్ రెడ్డి పేర్కొన్నారు.

డీఎస్పీని కలిసిన హిందూ ఉత్సవ సమితి సభ్యులు

ఆదిలాబాద్ డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన జీవన్ రెడ్డిను ఆయన కార్యాలయంలో సనాతన హిందూ ఉత్సవ సమితి సభ్యులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. సమితి ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలను అధ్యక్షులు ప్రమోద్ కుమార్ ఖత్రి డీఎస్పీకి వివరించారు. ఇందులో ప్రధాన కార్యదర్శి మాధవ్, ఉపాధ్యక్షులు రేనికుంట్ల రవీందర్, తోట పరమేశ్వర్ ఉన్నారు.

జాతర పనులను పర్యవేక్షించిన ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్

నవతెలంగాణ-లక్షెట్టిపేట

లక్షెటిపేట మండల ఇటిక్యాల గ్రామంలోని గోదావరి నది తీరాన సమ్మక్క, సారక్క జాతర ఏర్పాట్ల పనులను మంచిర్యాల నియోజకవర్గ శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు ఆదివారం పరిశీలించారు. ఈ నెల 21 నుండి 24 వరకు జరగబోయే సమ్మక్క, సారక్క జాతర సందర్భంగా ఏర్పాట్లను పర్యవేక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం అని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు.. జాతరకు అవసరమైన మౌళిక సదుపాయాలు కల్పించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చల్ల నాగభూషణం, వార్డ్ కౌన్సిలర్ ఉమాదేవి- కిరణ్, జాతర కమిటీ అధ్యక్షులు నిమ్మ రత్నాకర్, మండల అధ్యక్షులు పింగిలి రమేష్, కౌన్సిలర్ రాందేని వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



ఫీజు రియంబర్స్‌మెంట్ విడుదల చేయాలి

- పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్



నవతెలంగాణ - హాజీపూర్

పెండింగ్ లో ఉన్న ఫీజు రీయంబర్స్ వెంటనే చెల్లించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధాగం శ్రీకాంత్ డిమాండ్ చేశారు. మంచిర్యాల జిల్లా మార్క్స్ భవన్ లో ఆదివారం సంఘం మంచిర్యాల జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్య వక్తగా రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీకాంత్ పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో గత మూడు సంవత్సరాల నుండి పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్మెంట్ విడుదల చేయకపోవడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా రంగానికి అధిక నిధులు కేటాయించకుండా గత ప్రభుత్వం మాదిరే వ్యవహరిస్తోందని విమర్శించారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేసి కార్పొరేట్ విద్యా సంస్థలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలన్నారు. హాస్టల్ విద్యార్థులకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచి, సొంత భవనాలు నిర్మించాలన్నారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఉన్న శ్రీ చైతన్య పాఠశాల గుర్తింపులను రద్దు చేయాలన్నారు.మంచిర్యాల డీఈవోని తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రెడ్డి చరణ్, ఉపాధ్యక్షులు రాజ్ కుమార్, ఏ.రాహుల్, సహాయ కార్యదర్శులు టి. రాహుల్, సిద్ధార్థ, కోశాధికారి దీపిక, జిల్లా నాయకులు తిరుపతి, శంకరి, వంశీ తదితరులు పాల్గొన్నారు.

నాగోబా జాతర తైబజార్ వేలం రూ.19 లక్షలు



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

రాష్ట్రంలోనే ప్రసిద్ధి గాంచిన నాగోబా జాతర ఈ నెల 9 నుంచి 15 వరకు వారం రోజుల పాటు నిర్వహించారు. ఈ జాతరలో ప్రతి ఏటా వచ్చే ఆదాయాన్ని ఆదివారం దేవాదాయశాఖాధికారి రాజమౌళి, రెవెన్యూ, మెస్రం వంశీయుల ఆధ్వర్యంలో లెక్కించగా మొత్తం భక్తులు కానుకల రూపములో సమర్పించిన హుండి ఆదాయం రూ.8,62,015 రాగా తై బజార్ ద్వారా రూ.7,25,000, పేలాలు, పుటనలు రూ.44,000, కొబ్బరి చిప్పలు రూ.10,500, ఎలక్ట్రిసిటీ రూ.1,28000, వాహనాల పార్కింగ్ రూ.90,000, కొబ్బరి కాయల దుకాణం రూ.24,300, రంగుల రాట్నం ద్వారా రూ.1 లక్ష, మొత్తం ఆదాయం రూ.19,83,815 ఆదాయం వచ్చినట్లు ఈఓ తెలిపారు.

ప్రశాంతంగా సీఓఈ ప్రవేశ పరీక్ష

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ సొసైటి కాలేజ్ ఆఫ్ ఎక్స్ లెన్స్‌లో ప్రవేశం కోసం ఆదివారం నిర్వహించిన సీఓఈ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. జిల్లా కేంద్రంలోని బోథ్ ట్రైబల్ వెల్ఫర్ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో విద్యార్థులు ఉదయమే హాజరయ్యారు. వారి హాల్ టికెట్లను పరిశీలించి లోనికి వెళ్లారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ముందస్తుగా అన్ని ఏర్పాట్లు చేశారు. గిరిజన గురుకులం రీజనల్ కోఆర్డినేటర్ దిలీప్ కుమార్ పరీక్ష కేంద్రాన్ని సందర్శించి పరీక్ష కొనసాగుతున్న తీరును పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2 వేల 146 మందికి గాను ఏడు కేంద్రాలను ఏర్పాటు చేశామని, పరీక్షకు 2057 మంది హాజరు కాగా 89 మంది గైర్హాజరైనట్లు ఆయన తెలిపారు.

20న సేవాలాల్ జయంతి విజయవంతం చేయాలి

నవతెలంగాణ-నార్నూర్

ఈనెల 20న ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రాంలీలా మైదానంలో అధికారికంగా నిర్వహించే సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాన్ని విజయవంతం చేయాలనీ బంజారా యువసేన మండల అధ్యక్షుడు జాదవ్ దత్తా అన్నారు. ఆదివారం నాగల్‌కొండ గ్రామంలో సభ్యులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ప్రతి తండా నుండి లంబాడి గిరిజనులు తరలివచ్చి జయంతి ఉత్సవాన్ని జయప్రదం చేయాలనీ కోరారు. లంబాడిలు సంస్కృతి సంప్రదాయాలకు అనుగుణంగా వస్త్రధారణతో హాజరు కావాలన్నారు. ఇందులో బంజారా యువసేన సభ్యులు జాదవ్ రమేష్, జాదవ్ సురేష్, జాదవ్ నరేష్ ఉన్నారు.

అనాధ శవానికి అంత్యక్రియలు చేసిన స్మైల్ సొసైటీ

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

అదిలాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2 రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. ఆదివారం మృతుడి సంబంధికులు ఎవరు రాకపోవడంతో ఎస్సై ముజాహిద్ స్మైల్ సొసైటీ ప్రతినిధులకు సమాచారం అందించారు. వారు ముందుకు వచ్చి మృతదేహానికి సాంప్రదాయ బద్ధంగా అంత్యక్రియలు చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు కేమ శ్రీకాంత్, సురేష్, రఫీ, నజ్జు, విశాల్, సంతోష్, బాలాజీ పాల్గొన్నారు.

జావెలిన్ త్రో పోటీలలో స్వర్ణ పతకం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరగుతున్న 19వ జాతీయ ఇంటర్ డిస్ట్రిక్ట్ జూనియర్ అథ్లెటిక్స్ మీట్ పోటీల్లో ఆదిలాబాద్‌కు స్వర్ణ పతకం లభించింది. అండర్-14 జావెలిన్ త్రో పోటీలో జిల్లాకు చెందిన యర్మ లింగు 57.27 మీటర్ల జావెలిన్ విసిరి స్వర్ణ పతకం సాధించినట్లు జిల్లా అథ్లెటిక్స్ సెక్రటరీ పి.రాజేష్, కోచ్ మేనేజర్ లక్ష్మీ రామ్, వీజీఎస్ రాకేష్ ఆదివారం తెలిపారు. స్వర్ణ పతకం సాధించిన లింగుకు పలువురు అభినందనలు తెలిపారు.

బంజారా రచయితల వేదిక ఆధ్వర్యంలో మిఠాయిల పంపిణీ

నవతెలంగాణ- ఉట్నూర్

సంత్ సేవాలాల్ మహారాజ్ 285 వ జయంతి వేడుకలను బంజారా రచయితల వేదిక- ఆదిలాబాద్ జిల్లా ఆధ్వర్యంలో స్థానిక వికాసం పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఈ సందర్భంగా గౌరవధ్యక్షులు బంకట్ లాల్ జాదవ్ మాట్లాడుతూ పాఠశాలలో చదువుతున్న ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు సేవాలాల్ మహారాజ్ గొప్పతనాన్ని వివరించారు. ఆయన ఆశీస్సులు పిల్లలపై ఉండాలని ఎల్లవేళలా సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. తదుపరి ప్రత్యేక అవసరాలు గల పిల్లలందరికీ స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వేదిక అధ్యక్షులు డా.ఇంధల్ సింగ్, బంజారాప్రధాన కార్యదర్శి దేవావత్ ధరంసింగ్, ఉపాధ్యక్షులు పవార్ వినోద్, సహ కార్యదర్శి పరమేశ్వర్ చౌహాన్, వసంత్ జాదవ్, పాఠశాల ప్రిన్సిపల్ వికాస్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

కుక్కల దాడిలో జింక మృతి

నవతెలంగాణ- లక్ష్మణచాంద



కుక్కల దాడిలో జింక మృతి చెందిన ఘటన మండలంలోని మునిపెల్లిలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుడు గుర్రాల లింగారెడ్డి గోదావరి గట్టున ఉండే తన పంటపొలంలోకి వెళ్లినప్పుడు కుక్కలు జింకపై దాడిచేస్తున్న దృశ్యాన్ని చూసి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. సమాచారం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు వెళ్లి చూడగా జింక అప్పటికే మరణించిందని, చేసేదేమీ లేక అంత్యక్రియలు పూర్తిచేసి వెళ్లిపోయారని ఆయన తెలిపారు. వివరాల కోసం అటవిశాఖ అధికారులకు పోన్ చేయగా వారు స్పందించలేదు.

సమ్మక్క-సారలమ్మ జాతర ప్రారంభం

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్



మండలంలోని పెద్దవాగు పంపుహౌజ్ సమీపంలో ఏర్పాటు చేసిన సమ్మక్క గద్దెల వద్ద ఆదివారం సమ్మక్క సారలమ్మ జాతర ప్రారంభమైంది. మైసమ్మ దేవాలయంలో మొక్కులు చెల్లించి జాతరను ప్రారంభించారు. మొదటి రోజు గద్దెల వద్ద భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో భీమన్న, మహేష్, జాతర కమిటీ అధ్యక్షుడు తుమ్మ రమేష్, కార్యదర్శి పోలోజు శ్రీనివాస్, మంద రాజయ్య, కోట శంకర్, శ్రీనివాస్, పిరిసింగుల శ్రీనివాస్, తిరుమల్ రెడ్డి, బోమెల వెంకటేష్, పిరిసింగుల తిరుపతి పాల్గొన్నారు.

చండీగఢ్ కన్వెన్షన్‌లో జిల్లా నాయకుడు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



దళితుల సమస్యలు, రాజకీయ ఎజెండాగా చండీగఢ్‌లోని బాబా సోహన్ సింగ్ భక్నా భవన్‌లో డీవైఎఫ్ఐ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అఖిల భారత దళిత యువజన సమ్మేళనంలో జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితులపై వివక్ష, ఆర్థిక అసమానతలు సామాజిక వెలివేతలు వంటి ఎన్నో సామాజిక సమస్యలు పరిష్కారం కాకుండా మిగిలిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో జరగబోయే పరిణామాలు అభివృద్ధిపై చర్చించి రాబోయే ఎన్నికల్లో రాజకీయ పార్టీల జెండాలలో దళితుల అంశాన్ని పెట్టడానికి సదస్సు ఉపయోగపడుతుందన్నారు. సమస్యల పరిష్కారం కోసం డీవైఎఫ్ఐ పోరాటం చేస్తుందని పునరుద్ఘాటించారు.

ఎంపీపీ అవిశ్వాసంపై హైకోర్టు స్టే



నవతెలంగాణ-సిర్పూర్(టి)

తనపై కొంతమంది ఎంపీటీసీలు పొంతనలేని నిందుల వేసి అవిశ్వాస తీర్మానం పెట్టడం సరైందికాదని, ఒకే పార్టీలో ఉంటూ ఈ విధంగా మహిళలని కించపరిచే విధంగా నిందలు మోపడం ఎంతవరకు సమంజసమని ఎంపీపీ సునార్కర్ సువర్ణ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ మండల అభివృద్ధి కోసం వచ్చే నిధులను దుర్వినియోగం చేశానని ఈ నెల తొమ్మిదో తేదీన అవిశ్వాస తీర్మానాన్ని ఇవ్వడం జరిగిందన్నారు. మండల అభివృద్ధి కోసం ప్రభుత్వం నుండి వచ్చే నిధులు ఏ ఒక్క రూపాయి కూడా దుర్వినియోగం చేయలేదని తెలిపారు. ఇలాంటి నిందలు మోపడం బాధాకరమని, దీనికి హైకోర్టు ద్వారా ఈ నెల 20వ తేదీన అవిశ్వాస తీర్మానాన్ని వాయిదా వేయడానికి స్టే తెచ్చుకోవడం జరిగిందన్నారు.

జాతీయస్థాయి అథ్లెటిక్ పోటీల్లో విద్యార్థిని ప్రతిభ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జాతీయస్థాయి అథ్లెటిక్ పోటీల్లో జిల్లాకు చెందిన విద్యార్థిని ప్రతిభ కనబరిచింది. గిరిజన సంక్షేమ జిల్లా క్రీడల అధికారి మీనారెడ్డి, క్రీడల పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణారావు మాట్లాడుతూ గుజరాత్‌లోని అహ్మదాబాద్ ఈనెల 16వ తేదీ నుండి జరుగుతున్న జాతీయ స్థాయి అథ్లెటిక్ పోటీల్లో ఆసిఫాబాద్ గిరిజన క్రీడా పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఎం.సాక్షి అండర్-14 కిడ్స్ జావెలిన్ త్రో విభాగంలో అత్యంత ప్రతిభ కనబరిచి రికార్డు సృష్టించినట్టు తెలిపారు. జావెలిన్ త్రో విభాగంలో 29.97 మీటర్ల దూరం విసిరి బ్రాంజ్ మెడల్ సాధించిందన్నారు. ఉత్తమ ప్రతిభ కనపర్చిన సాక్షిని, అథ్లెటిక్ శిక్షకుడు విద్యాసాగర్‌ని డీటీడీఓ రమాదేవి, పి.ఉద్ధవ్, ఏటీడీఓ క్షేత్రయ్య, జీసీడీఓ శకుంతల, తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి సారంగపాణి, జాయింట్ సెక్రటరీ వెంకటేశ్వర్ రెడ్డి, ఇండియన్ అథ్లెటిక్ టీంకోచ్ ద్రోణాచార్య అవార్డు గ్రహీత నాగపురి రమేష్, కుమురంభీమ్ జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్ష,కార్యదర్శులు, కోట్నాక విజయ్, సట్ల శంకర్, గుండం లక్ష్మణ్, హ్యాండ్ బాల్ శిక్షకులు అరవింద్, ఖోఖో శిక్షకుల తిరుమల్, టీం మేనేజర్ పిట్టల స్వప్న, జిల్లాలోని వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడా పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించారు.

గిరిజనులకు దుస్తుల పంపిణీ



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

మండలంలోని మారుమూల కొలాంగూడ గిరిజన గ్రామంలో గ్రామస్తులకు ఆదివారం శ్రీమిత్ర సేవా సమితి ఆధ్వర్యంలో బట్టల పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీ మిత్ర సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు సుంకరి తిరుపతి, సభ్యులు తౌటి ప్రభాకర్, వినోద్, సోతుకు బాలకృష్ణ, శ్యామ్ రావు, కొమ్ము లక్ష్మీనారాయణ, అశోక్, అఖిల్ తేజ్, శేఖర్, జాడి మంజుల, పొన్న స్రవంతి, కమలాకర్, నాగమణి పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో గడ్డివాము దగ్ధం

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

మండలంలోని వంజీరి పంచాయతీ నందిగూడలో ఆదివారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గడ్డివాము దగ్ధమైంది. లోంబడె పోచయ్య తన పశువుల కోసం ఇంటి సమీపంలో వరిగడ్డి నిల్వ చేసుకున్నాడు. పై నుండి విద్యుత్ తీగల్లో షార్ట్ సర్క్యూట్ కలిగి మంటలు చెలరేగాయి. దీంతో మంటలు చెలరేగి గడ్డివాముపై పడడంతో వరిగడ్డి పూర్తిగా కాలిపోయింది. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా వరిగడ్డి నష్టపోయానని బాధితుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

26న మెగా జాబ్ మేళా

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఈనెల 26న జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిరుద్యోగ యువతీ యువకులకు పోలీసుల ఆధ్వర్యంలో వివిధ కంపెనీలకు సంబంధించి మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ సురేష్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పది, ఇంటర్మీడియట్, పాలిటెక్నిక్, ఏదైనా డిగ్రీ, పీజీ పాసైన యువతీ యువకులు జాబ్‌మేళాకు హాజరుకావాలని, దాదాపు 50 బహుళ జాతీయ కంపెనీలు జాబ్ మేళాలో ఉద్యోగాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. కనీస వేతనం రూ.18వేల నుంచి నుండి రూ.75 వేల వరకు ఉంటుందని పేర్కొన్నారు. ఇతర వివరాల కోసం స్థానిక పోలీస్ స్టేషన్‌లో సంప్రదించి అభ్యర్థుల వివరాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

21న ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టాపన

నవతెలంగాణ-వాంకిడి

మండలకేంద్రంలోని ఇందిరానగర్ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న ఆలయంలో ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని ఈ నెల 21న ఉదయం 10.44 నిమిషాలకు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ ప్రతిష్ఠాపన మహోత్సవం బ్రహ్మశ్రీ పెంద్యాల గౌతమ శర్మ, బ్రహ్మశ్రీ బట్టి సీతారాం, బ్రహ్మశ్రీ కుందారపు శంకర్ శర్మ వేదమంత్రోచ్ఛరణలతో ప్రత్యేక పూజలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. దీనికి మండలంలోని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పది పరీక్షలకు సన్నద్ధం చేయడమే లక్ష్యం

- ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు షేక్ జాఫర్



ఆసిఫాబాద్‌లో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

పదవ తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలకు సిద్ధం చేయడమే తమ లక్ష్యమని, ఇందులో భాగంగానే టాలెంట్ టెస్ట్ నిర్వహించినట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు షేక్ జాఫర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పలు పాఠశాలల్లో జిల్లా కార్యదర్శి తుమ్మిడే భీమేష్‌తో కలిసి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను వెలికి తీయడంతో పాటు పబ్లిక్ పరీక్షలకు సిద్ధం చేసేందుకు ఈ పరీక్ష ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థులలో ఉన్న భయాన్ని పోగొట్టడం కోసం నిర్వహించిన పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 2100 మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. విద్యార్థుల కోసం నిరంతరం ఉద్యమాలే కాకుండా విద్యార్థుల్లో ఉన్న మేధాశక్తిని వెలికి తీయడం కోసం ఎస్ఎఫ్ఐ ముందుంటుందన్నారు. విద్యార్థులు కూడా పబ్లిక్ పరీక్షలకు భయం లేకుండా మంచిగా చదివి బాగా రాయాలని సూచించారు. భవిష్యత్తులో విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేయడంతో పాటు విద్యార్థులకు ఆసరాగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆదివాసీ సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు మాలశ్రీ, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు టీకానంద్, డీవైఎఫ్ఐ నాయకులు, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సతీష్, నాయకులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ : విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రతీ ఏటా టాలెంట్ టెస్ట్‌ను నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి తుమ్మిడె భీమేష్ అన్నారు. ఆదివారం స్థానిక వసుంధర డిగ్రీ కళాశాలలో నిర్వహించిన టాలెంట్ టెస్ట్ ప్రశ్నాపత్రాన్ని ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా భీమేష్ మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలంటే విద్యార్థులకు ఉన్న భయం కూడా ఈ పరీక్ష ద్వారా తొలగిపోతుందని అన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం తాము పోరాటాలు చేయడమే కాకుండా, విద్యార్థులలో దాగి ఉన్న మేధాశక్తిని వెలికితీసే ఇలాంటి కార్యక్రమాలు కూడా తాము చేపడుతున్నట్లు తెలిపారు. ఈ టాలెంట్ టెస్ట్‌కు సుమారు 500 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ ఆలిండియా కమిటీ సభ్యురాలు ఆర్ త్రివేణి, జిల్లా ఉపాధ్యక్షురాలు అరుణ, పద్మ, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మహిపాల్, మండల కార్యదర్శి బాలకృష్ణ, కళాశాల ప్రిన్సిపల్ హేమలత, ఉపాధ్యాయులు శ్రీకాంత్, ఎస్ఎఫ్ఐ నాయకులు శ్రీకాంత్, హరీష్, పవన్, బాలాజీ, ప్రవీణ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

సిర్పూర్(టి) : విద్యార్థుల్లో సృజనాత్మకత శక్తిని వెలికితీసేందుకు, పోరాటాలతో పాటు చదువులో రాణించాలా ఎస్ఎఫ్ఐ చేస్తున్న కృషి అభినందనీయమని ఎస్ఐ దీకొండ రమేష్ అన్నారు. ఆదివారం భారతీయ విద్యార్థి ఫెడరేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు టాలెంట్‌టెస్టును స్థానిక జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో నిర్వహించారు. దీనికి ఎస్ఐ అతిథిగా హాజరై టాలెంట్‌టెస్టు పేపర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి అధునాతన కాలంలో విద్యార్థులు వారి మేథోశక్తిని పోటీ ప్రపంచానికి అనుగుణంగా పెంపొందించుకోవాలన్నారు. విజ్ఞాన వంతులుగా, మేథావులుగా తయారవ్వాలన్నారు. విద్యార్థులు పాఠ్య పుస్తకాలతో పాటు అనేక సాంస్కృతిక అభ్యుదయ పుస్తకాలు చదువుతూ సమాజాన్ని అధ్యాయనం చేయాలన్నారు. ఉద్యమాలతో పాటు విద్యార్థులకు టాలెంట్‌టెస్టును నిర్వహించడంతో వారిలో సృజనాత్మకతను వెలిగి చూసేందుకు ఎస్ఎఫ్ఐ టాలెంట్ టెస్టు ఉపయోగపడుతుందన్నారు. రాబోయే పబ్లిక్ పరీక్షల్లో ఎలాంటి భయాందోళలనకు గురికాకుండా ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులు కావడానికి కృషి చేయాలని, తల్లిదండ్రులకు, చదువు చెప్పిన గురువులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి సుంకరి సాయికృష్ణ మాట్లాడుతూ మండలంలో మూడు కేంద్రాల్లో 170 మంది విద్యార్థులు పరీక్ష రాశారని, విద్యార్థుల హక్కుల కోసం వారి సమ్యలపై పోరాటమే కాకుండా టాలెంట్‌టెస్టు నిర్వహించి వారిలోని భయాన్ని పోగొట్టడానికి ఈ టెస్టులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు మహేష్, బీవైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు సవిత, ఉపాధ్యాయులు రవి పాల్గొన్నారు.



సిర్పూర్(టి)లో ప్రశ్నాపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎస్ఐ దీకొండ రమేష్



కాగజ్‌నగర్‌లో ప్రశ్నాపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

వికలాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలి

- ఎన్‌పీఆర్‌డి రాష్ట్ర కార్యదర్శి ఎం అడివయ్య



మాట్లాడుతున్న ఎన్‌పీఆర్‌డి రాష్ట్ర కార్యదర్శి ఎం అడివయ్య

నవతెలంగాణ-కాగజ్‌నగర్

వికలాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే భర్తీ చేయాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డి) రాష్ట్ర కార్యదర్శి ఎం అడివయ్య డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో ఎన్‌పీఆర్‌డి జిల్లా కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పదేళ్లుగా వికలాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీకి నోచుకోవడం లేదని, ఈ పోస్టుల భర్తీకి ప్రత్యేక నోటిఫికేషన్ జారీ చేయాలని డిమాండ్ చేశారు. 2016 వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతీ వికలాంగులనికి అంత్యోదయ రేషన్ కార్డులు మంజూరు చేయాలని సుప్రీంకోర్టు ఉత్తర్వులున్నా అమలుకు నోచుకోవడం లేదని అన్నారు. అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ వికలాంగులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్‌పీఆర్‌డి జిల్లా గౌరవాధ్యక్షులు ముంజం ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ మార్చి మూడో తేదీన కాగజ్‌నగర్‌లో వికలాంగుల చట్టాలు-సంక్షేమ పథకాలపై జిల్లా సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని వికలాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. సదరం క్యాంపుల వద్ద కనీస సౌకర్యాలు కల్పించడం లేదని అన్నారు. బ్యాంకులు ఇచ్చే రుణాలలో ఐదు శాతం రుణాలను వికలాంగులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎన్‌పీఆర్‌డి జిల్లా నాయకులు పి రాజేష్, ప్రదీప్ మండల్, దుర్గం హరిలాల్, జాకీర్‌పాషా, జి రాజు, పి వెంకటేష్, దస్తగిరి పాల్గొన్నారు.

విజయ సంకల్ప యాత్ర విజయవంతం చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఈనెల 22 23 తేదీల్లో జిల్లాలో నిర్వహించనున్న విజయ సంకల్ప యాత్రను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. జిల్లా కార్యాలయంలో విజయ సంకల్పయాత్ర ప్రముఖ్ రామ్ నాథ్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పార్లమెంటు నియోజకవర్గాలను 5 క్లస్టర్‌గా విభజించినట్లు తెలిపారు. వీటిలో కృష్ణమ్మ భద్రకాళి, భాగ్యలక్ష్మి, రాజరాజేశ్వరి, కుమురం భీమ్ పేర్లమీదుగా యాత్రలు ప్రారంభమవుతాయన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఈనెల 20న బాసరలో ప్రారంభమయ్యే యాత్ర భైంసాలో జరగనున్న బహిరంగ సభకు అస్సాం ముఖ్యమంత్రి హేమంత్ బిశ్వాస్ శర్మ హాజరుకానున్నట్లు తెలిపారు. అనంతరం ఆదిలాబాద్ మీదుగా 22న జిల్లాలోని జైనూరులో ప్రవేశించి అక్కడ రోడ్ షో నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం కెరమెరి మీదుగా సాయంత్రం జిల్లా కేంద్రానికి చేరుకొని అంబేద్కర్ చౌక్ వద్ద బహిరంగ సభ ఉంటుందన్నారు. అదేరోజు కాగజ్‌నగర్ కేంద్రానికి యాత్ర చేరుకుంటుందని, తిరిగి 23న కాగజ్‌నగర్ కేంద్రంలో బహిరంగ సభ నిర్వహించి రెబ్బెన మీదుగా మంచిర్యాల జిల్లాలో యాత్ర ప్రవేశిస్తుందని తెలిపారు. మూడోసారి మోడీ అధికారంలోకి రావడం ఖాయమని, అతి విశ్వాసానికి పోకుండా కార్యకర్తలు యాత్రను విజయవంతం చేసేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి చర్ల మురళి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కృష్ణకుమారి, నాయకులు రావుల రాజేందర్, కిరణ్, సొల్లు లక్ష్మి, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్

కేంద్ర సాహిత్య అకాడమి సమ్మేళనానికి ఆహ్వానం

నవతెలంగాణ-వాంకిడి

మండలానికి చెందిన యువ కవులు ఆత్రం మోతీరాం, కొట్నాక సాయికుమార్‌కు కేంద్ర సాహిత్య అకాడమి సమ్మేళనానికి ఆహ్వానం అందినట్లు వారు తెలిపారు. ఈ నెల 21న కేంద్ర సాహిత్య అకాడమి ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ ఆంధ్రలోయల కళాశాలలో నిర్వహించే అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివాసీ మౌళిక జానపద సాహిత్యంతో పాటు తమ మాతృభాషలైన కొలాం, గోండి భాషాలో కవిత పఠనం చేయనున్నట్లు తెలిపారు. ఈ ఆహ్వానం అందినందుకు గాను భీంరావు, మనోహర్, రవీందర్‌తో పాటు పలువురు అభినందనలు తెలిపారు. మండలం నుంచి మాతృభాషా దినోత్సవంలో పాల్గొనడం గర్వకారమని మండల వాసులు అంటున్నారు.

ఒంటరి మహిళపై అత్యాచారయత్నం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలో ఒంటరి మహిళపై అత్యాచారయత్నం జరగడం కలకలం రేపింది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం శనివారం రాత్రి పట్టణంలోని కంచుకోట ప్రాంతానికి చెందిన ఒంటరి మహిళ (25) జీవనోపాధి కోసం పట్టణంలోని ఓ ఫ్యాన్సీ స్టోర్‌లో సెల్స్ ఉమెన్‌గా పనిచేస్తోంది. బాధితురాలి కదలికలపై కొంతకాలంగా నిఘా ఉంచిన గుర్తుతెలియని నేరగాళ్లు శనివారం రాత్రి ఆమెపై అత్యాచారానికి ప్రయత్నించారు. అయితే బాధితురాలు కేకలు వేయడంతో నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. ఈ పోరాటంలో దాడి చేసిన వ్యక్తులు మహిళను కొట్టారు. దీని కారణంగా ఆమె తలపై బలమైన గాయాలయ్యాయి. ఆమె తన ఇంటికి వెళ్లి తన తల్లికి జరిగిన విషయాన్ని చెప్పింది. పోలీసులు మహిళల భద్రత కోసం ఎన్ని చట్టాలు తీసుకువచ్చిన ఇటువంటి వారి ముందు అవి నిలబడలేకపోతున్నాయి. జిల్లా కేంద్రంలో రాత్రిపూట మద్యం సేవించి మహిళలను ఇతరులను ఇబ్బంది పెట్టే వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతున్నాయి.

ప్రశాంతంగా సీఓఈ ప్రవేశ పరీక్ష

- 851 మందికి 828 మంది హాజరు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

గిరిజన గురుకులాల సంస్థ ఆధ్వర్యంలో 2024-25 విద్యా సంవత్సరానికి ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు నిర్వహించిన సీఓఈ ప్రవేశ పరీక్ష ఆదివారం జిల్లా కేంద్రంలో ప్రశాంతంగా ముగిసింది. జిల్లా కేంద్రంలో మూడు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. గిరిజన బాలుర పాఠశాలలో 447 మందికి 440 మంది, బాలికల గురుకులంలో 216కు 206, గిరిజన డిగ్రీ కళాశాలలో 188కు 181 మంది విద్యార్థులు హాజరైనట్లు అధికారులు తెలిపారు. పరీక్ష నిర్వహణ తీరును ఉమ్మడి ఆదిలాబాద్ గిరిజన గురుకులాల సమన్వయాధికారి గంగాధర్ సందర్శించారు. సీఎస్‌లు సురేష్, అనిత పరీక్షలను పర్యవేక్షించారు.

భక్తి శ్రద్ధలతో కొనసాగుతున్న బీరన్న పూజలు



నవతెలంగాణ-కౌటాల

మండలంలోని శిర్షా గ్రామంలో బీరయ్య కళ్యాణ మమక్షత్సవ పూజలు భక్తి శ్రద్ధలతో జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం తెల్లవారు జామున నాలుగు గంటలకు మహిళలు బోనాలతో బీరన్న ఆలయం వరకు ఒగ్గుడోలు, బీర్ల కళాకారుల విన్యాసాలతో, పూజలతో, సప్పుల్లతో బీరయ్య ఆలయం వరకు వచ్చి స్వామికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామంలోని గొర్రెలు, మేకల మందలపై సరు చల్లి తమ గొర్రెలు, మేకలు సక్కగా ఉండాలని, సిరి సంపదలు తమకు ఎళ్లవేళల ఉండాలని కోరుకున్నారు. బీరయ్య కామరాతి కళ్యాణం చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఎగ్గేటి శంకర్, సూర పోషమల్లు, పెద్దల బీరయ్య, అల్లి తిరుపతి, జగ్గయ్య, పోలే శ్రీశైలం, సింగిరి, బీమసేన పాల్గొన్నారు.

గ్రూప్-4 ర్యాంకర్ శివకృష్ణకు సన్మానం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఇటీవల టీఎస్పీఎస్సీ ప్రకటించిన గ్రూప్-4 పరీక్షల్లో జిల్లా కేంద్రానికి చెందిన శివకృష్ణ ప్రథమ ర్యాంకు సంపాదించగా విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ కంచుకోట కాలనీకి చెందిన శ్రీరాం వాణిశ్రీ, సత్యనారాయణ చారిల కుమారుడు శ్రీరాం శివకృష్ణ చారి రాష్ట్ర ప్రథమ ర్యాంకు సంపాదించడం సంతోషంగా ఉందన్నారు. ఇది జిల్లాకే గర్వకారణమని కొనియాడారు. ఈ సన్మాన కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ (విశ్వకర్మ) సంఘం జిల్లా అధ్యక్షుడు భాస్కరాచారి, జిల్లా గౌరవ అధ్యక్షులు సురేష్ చారి, స్వర్ణకార సంఘం జిల్లా అధ్యక్షులు శ్రీరాములు చారి, జిల్లా మండల నాయకులు వెంకటయ్య చారి, ప్రసాద్ చారి, మహేష్ చారి, మోహన్, మనోహర్, తిరుపతి చారి, రమేష్ చారి, వెంకటన్న, మొండి, శ్రీనివాస్, సంతోష్ పాల్గొన్నారు.

పురుగుల మందుతాగి ఒకరు ఆత్మహత్య

నవతెలంగాణ - కౌటాల

పురుగుల మందుతాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని బోదంపెల్లి గ్రామంలో జరిగింది. ఎస్ఐ మధుకర్ తెలిపిన వివరాల ప్రకారం సూరం విజయ్(24) కుటుంబ పోషణ విషయంలో ఈ నెల 14వ తేదీన రాత్రి 10 గంటల సమయంలో విజయ్ భార్య పల్లవితో గొడవ పడ్డాడు. అదేరోజు రాత్రి పల్లవి అదే గ్రామంలోని తల్లిగారి ఇంటికి వెళ్లింది. వీరికి తొమ్మిది నెలల పాప కూడా ఉంది. శనివారం విజయ్ అత్తగారి ఇంటికి నా భార్యను పంపించండని మేడారం వెళ్తామని చెప్పగా వారు పంపించకపోవడంతో మనస్తాపానికి గురైన విజయ్ చేనులోకి వెళ్లి పురుగుల మందు తాగి చనిపోయాడు. మృతుడి అన్న సూరం బానేష్ తమ్ముడి కోసం వెతకగా వారి చేనులో చనిపోయి ఉన్నట్టు గుర్తించాడు. అన్న బానేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

నేడు శివాజీ మహారాజ్ జయంతి

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

హిందువాహిణి ఆధ్వర్యంలో హిందూహృదయ సామ్రాట్, అఖండ హిందు రాజ్య స్థాపకుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలను పురస్కరించుకుని సోమవారం భారీ శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు హిందు వాహిణి జిల్లా సంయోజక్ ఎన్రాల శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హిందు వాహిణి సభ్యులతో కలిసి కార్యక్రమ వివరాలను ఆయన వెల్లడించారు. పట్టణంలోని శ్రీరామచంద్ర గోపాలకృష్ణ మఠం వద్ద నుంచి ఈ భారీ శోభాయాత్ర ప్రారంభమై వినాయక్‌చౌక్, నేతాజీచౌక్, అంబేద్కర్ చౌక్ మీదుగా శివాజీచౌక్ వరకు జరగనుందని పేర్కొన్నారు. గోపాలకృష్ణ మఠం వద్ద సాయంత్రం ఐదు గంటలకు ప్రారంభమయ్యే ఈ శోభాయాత్రలో ప్రజలు, హిందు బంధువులు, రాజకీయ నాయకులు, పుర ప్రముఖులు, పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.